www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 2 సంచిక -249 శనివారం 23 నవంబర్ 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి — మా అక్షరం-మీ ఆయుధం — తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

# అనర్హతపై స్పీకర్‌దే తుది నిర్ణయం

- తగిన సమయంలో నిర్ణయం తీసుకునే అధికారం
- ఐదేళ్ల అసెంబ్లీ కాలం దృష్టిలో పెట్టుకోవాలని సూచన
- నాలుగు వారాల గడువు పెడుతూ ఇచ్చిన తీర్పు కొట్టివేత
- అనర్హత పిటిషన్‌పై హైకోర్టు సిజె ధర్మాసనం సంచలన తీర్పు



హైదరాబాద్, నవంబర్ 22ప్రజావినికిడి:

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై షెడ్యూలు ఖరారు చేయాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సీజే ధర్మాసనం కొట్టేసింది. తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సూచించింది. నిర్ణయం తీసుకునే అధికారం స్పీకర్‌దేనని కూడా స్పష్టం చేసింది. 10వ షెడ్యూల్ ప్రకారం అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలంది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, ఐదేళ్ల అసెంబ్లీ గడువును దృష్టిలో ఉంచుకొని స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది.

.మిగతా 2లో...

# భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు గొప్పవి

- వాటిని మరింతగా పటిష్టం చేసుకోవాలి
- లోక్‌మంథన్ కార్యక్రమంలో రాష్ట్రపతి పిలుపు
- రెండురోజుల పర్యటన ముగించుకుని ఢిల్లీకి ప్రయాణం




హైదరాబాద్, నవంబర్ 22ప్రజావినికిడి:

భారతీయ సంస్కృతి, ఆచారాలను నిరంతరం పటిష్ఠం చేయాల్సి ఉందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. హైదరాబాద్‌లోని శిల్పారామంలో లోక్‌మంథన్ ప్రధాన కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. దేశ ప్రజల్లో సాంస్కృతిక, స్వాభిమాన్ భావన నెలకొల్పాల్సి ఉందని చెప్పారు. రాష్ట్రాలను బలోపేతం చేసే దిశగా లోక్ మంథన్ కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. '2018లో రాంచీలో లోక్‌మంథన్ కార్యక్రమంలో పాల్గొన్నా. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పటిష్టానికి ఈ ప్రయత్నం గొప్పది. ఇందులో పాల్గొంటున్న ప్రతి ఒక్కరిని అభినందిస్తున్నా. భిన్నత్వంలో ఏకత్వం భారతీయ సంస్కృతిలో భాగం. ఇది ఇంద్రధనస్సులోని సౌందర్యాన్ని సూచిస్తుంది' అని ద్రౌపదీ ముర్ము అన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను బలోపేతం చేసే గొప్ప కార్యక్రమం అని లోక్ మంథన్ అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం గర్వంగా భావిస్తున్నానని తెలిపారు. భారతదేశ సంస్కృతి, ఆచార వ్యవహారాలు, మన పరంపర చాలా ఘనమైనవి అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం గురించి మాట్లాడతాం.. పాటిస్తాం అన్నారు.

మిగతా 2లో...



# అదానీతో రేవంత్ రెడ్డి దందాను రాహుల్ సమర్థిస్తున్నారా?

- తెలంగాణలో చేసుకున్న ఒప్పందాలకు మద్దతిస్తున్నారా?
- దానికి దేశవ్యాప్తంగా ఒక్కటే విధానం ఉండాలి కదా?
- కాంగ్రెస్ పార్టీది గల్లీలో ఒక నీతి! ఢిల్లీలో మరో నీతి
- రాహుల్ ను సూటిగా ప్రశ్నించిన కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 22ప్రజావినికిడి:

తెలంగాణలో అదానీతో రేవంత్ రెడ్డి దందాను రాహుల్ గాంధీ సమర్థిస్తున్నారా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. ప్రతి రోజు అదానీని విమర్శించే రాహుల్ గాంధీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలకు మద్దతిస్తున్నారా? చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అదానీ వ్యవహారంపై కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.

మిగతాది 2లో...



# ప్రజా పాలన విజయోత్సవాల్లో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం

- గడప గడపకు చేరేలా విస్తృత కార్యక్రమాలు
- 7, 8, 9 తేదీల్లో ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్ మార్గాల్లో కార్నివాల్
- అధికారులతో సమీక్షలో డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్, నవంబర్ 22ప్రజావినికిడి:

ప్రజా ప్రభుత్వం అమలు చేసిన పథకాలు గడప గడపకు చేరేలా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజా పాలన విజయోత్సవాల్లో ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలని సూచించింది. అన్ని శాఖల అధికారులు ప్రజాపాలన విజయోత్సవాల సంబరాలు జరపాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా నెల 30న మహబూబ్ నగర్‌లో రైతు దినోత్సవం సభ డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్ మార్గాలలో కన్నుల పండగగా కార్నివాల్, లేజర్ షో, పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంకల్పించారు. పండుగ వాతావరణంలో ప్రజా పాలన విజయోత్సవాలను నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పలు సూచనలు చేశారు. మావేశానికి మంత్రులు ఉత్త మ్ , పొంగులేటి, సీతక్క, ప్రభుత్వ సలహాదారులు హాజరయ్యారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అవుతున్న సందర్భంగా, ఈ సంవత్సర కాలంలో చేపట్టిన విప్లవాత్మక పథకాల అమలు, కార్యక్రమాలను రాష్ట్రంలోని ప్రతి గడప గడపకు చెర వేసేలా విస్తృత స్థాయిలో కార్యక్రమాలను చేపట్టాలని మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

# ప్రత్యేక విభాగం హైడ్రా!

## జీహెచ్ఎంసీలో బాగం కాదు

- చెరువుల పరిరక్షణ
- ఆక్రమణల తొలగింపు హైడ్రా ధ్యేయం
- స్పష్టం చేసిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



హైదరాబాద్, నవంబర్ 22ప్రజావినికిడి:

ఇకపై చెరువులు అన్యాక్రాంతం కాకుండా హైడ్రా చీఫ్ రంగనాథ్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. హైడ్రా ఈ ఏడాది జూలైలో ఏర్పడిందని.. అర్బన్ డిజాస్టర్స్, ఎంక్రోచ్‌ల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. శుక్రవారం బుద్ధ భవన్ హైడ్రా కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు కమిషనర్ రంగనాథ్ కీలక సమావేశం నిర్వహించారు. రిటైర్డ్ ఈఎన్సీలు, ఇరిగేషన్ సీఈలు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సీనియర్ అధికారులతో సమీక్ష సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కనుమరుగైన చెరువులపై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. చెరువులకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను అధికారులు నిర్ణయించారు.

మిగతాది 2లో...

# హైదరాబాద్ ఫార్మాసిటీలో భారీగా పెట్టుబడులు

- గ్రీన్ ఫార్మాసిటీలో పెట్టుబడులు పెట్టనున్న కంపనీలు
- ముందుకు వచ్చిన పలు దిగ్గజ కంపెనీలు
- రూ.5,260 కోట్ల పెట్టుబడులు పెట్టనున్న సంస్థలు
- 12,490 మందికి ఉద్యోగాలు లభించే అవకాశం
- ముఖ్యమంత్రితో ఫార్మా ప్రతినిధులు భేటీ
- పరిశ్రమల ఏర్పాటుకు ఎంవోయూలపై సంతకాలు



హైదరాబాద్, నవంబర్ 22ప్రజావినికిడి:

హైదరాబాద్ మహానగరంలో విశ్వనగరంగా ఎదుగుతోంది. ఇప్పటికే అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు భాగ్యనగరంలో పెట్టుబడులు పెట్టాయి. వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయి. మరికొన్ని సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్నాయి. తాజాగా.. హైదరాబాద్ ఫార్మాసిటీలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలోని ఐదు దిగ్గజ ఫార్మా కంపెనీలు ముందుకొచ్చాయి. డాక్టర్ రెడ్డీస్, అరబిందో, హెటిరో, ఎంఎస్ఎన్, లారస్ కంపెనీలు గ్రీన్ ఫార్మాసిటీలో పెట్టుబడులు పెట్టనున్నాయి.

మిగతాది 2లో...

# కేబినెట్ విస్తరణకు కసరత్తు ?

- మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల అనంతరం విస్తరణ!!
- మైనారిటీలకు ప్రాధాన్యత ఇవ్వనున్న అధిష్టానం
- యువతకు అధిక అవకాశాలు కల్పించాలని కసరత్తు
- కొందరి శాఖలలో మార్పు కూడా ఉండే అవకాశం

2లో.



# అనర్హతపై స్పీకర్‌దే తుది నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

భారాస తరఫున ఎమ్మెల్యేలుగా గెలిచిన కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరడంతో వారిపై అనర్హత వేటు వేయాలంటూ భారాస ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కె.పి.వివేకానంద్‌లు పిటిషన్లు దాఖలు చేశారు. వీటితోపాటు దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. అనర్హత పిటిషన్‌లను స్పీకర్ స్వీకరించకపోవడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. సెప్టెంబరు 9న దీన్ని విచారించిన సింగిల్ జడ్జి.. 4 వారాల్లో అనర్హత పిటిషన్‌లపై షెడ్యూలు ఖరారు చేయాలని తీర్పు వెలువరించారు. సింగిల్ జడ్జి తీర్పును సవాలు చేస్తూ హైకోర్టులో అసెంబ్లీ కార్యదర్శి వి. నరసింహాచార్యులు దాఖలు చేసిన అప్పీళ్లపై ఇటీవల వాదనలు ముగియగా తీర్పును వాయిదా వేసింది. తాజాగా స్పీకర్ తీసుకోవాలంటూ శుక్రవారం ఉన్నత న్యాయస్థానం తీర్పును వెలువరించింది. దీంతో జంపింగ్ జంపాగ్‌లకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. పారటీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలు తీసుకునేలా అదేశాలు ఇవ్వాలని కోరుతూ బీఆర్‌ఎస్ నేతలు పిటిషన్ వేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై 4 వారాల్లోగా టైం ఫ్రేమ్ ఫిక్స్ చేయాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం వినోద్ కుమార్‌కు సింగిల్ బెంచ్ ఆదేశించింది. సింగిల్ బెంచ్ ఆదేశాలను సవాలు చేస్తూ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అసెంబ్లీ కార్యదర్శి అప్పీల్ చేశారు. అసెంబ్లీ కార్యదర్శి రిట్ అప్పీల్‌పై హైకోర్టు తీర్పు ప్రకటించింది. స్పీకర్ తుది నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు డివిజన్ బెంజ్ స్పష్టం చేసింది. స్పీకర్‌కు ఏలాంటి నిర్దుష్ట సమయం అంటూ లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. తగిన స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు కొట్టేవేసింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై 10వ షెడ్యూల్ ప్రకారం నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌కు సీజే ధర్మాసనం సూచించింది

# డిసెంబర్ 15,16 తేదీల్లో గ్రూప్ 2 పరీక్షలు

## తెలంగాణ గ్రూప్ 2 పరీక్షల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, నవంబర్ 22ప్రజావినికిడి:

తెలంగాణ గ్రూప్ 2 పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. తెలంగాణలో 783 గ్రూప్ 2 పరీక్షల నిర్వహణ కోసం ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైంది. డిసెంబర్ 9వ తేదీ నుంచి హాల్ టిక్కెట్‌లో కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. డిసెంబర్ 15,16 తేదీల్లో పరీక్షల్ని నిర్వహిస్తారు.తెలంగాణ గ్రూప్-2 రాత పరీక్షల షెడ్యూల్ ఖరారైంది. డిసెంబర్ 9వ తేదీ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ మేరకు పరీక్షల టైం టేబుల్ టీజీపీఎస్సీ విడుదల చేసింది.తెలంగాణలో 783 గ్రూప్-2 పోస్టుల భర్తీకి డిసెంబరు 15, 16 తేదీల్లో రాత పరీక్షలు జరుగుతాయని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. గ్రూప్ 2 హాల్ టికెట్లు డిసెంబరు 9 నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయనికమిషన్ పేర్కొంది. తెలంగాణ గ్రూప్ 2 పరీక్షల టైంటేబుల్, సూచనలతో కూడిన వివరాలను వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. ప్రతి పేపరులో 150 ప్రశ్నలుంటాయి. 150 మార్కులకు పరీక్ష జరుగుతుంది.

# ప్రాణాలు పోయినా భూములివ్వం..

## కందుకూరు, కొడంగల్‌లో తిరగబడ్డ రైతులు

హైదరాబాద్, నవంబర్ 22ప్రజావినికిడి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నికంకుశంగా వ్యవహరిస్తున్నది. భూసేకరణ పేరుతో నిర్భంధకాండ కొనసాగిస్తున్నది. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా రైతుల భూములను లాక్కుంటు న్నది. ఫార్మా సిటీ పేరిట లగచర్ల రైతులు తిరగబడిన ఘటన మరువకముందే తాజాగా రంగారెడ్డి జిల్లాలోని కందుకూరు, కొంగరకలాన్‌లో మరోసారి రైతులు తిరగబడ్డారు. ప్రాణం పోయినా ఫ్యూచర్ సిటీకి మా భూములు ఇవ్వమని స్పష్టం చేశారు. భూములు ఇచ్చే ప్రసక్తే లేదంటూ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. భారీ ఎత్తున పోలీసులను మోహరించి సర్వే పనులు చేపపడుతున్నారు.కాగా,30 వేల ఎకరాల్లో ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ నిర్మించనున్నది. హైదరాబాద్ నగర శివార్లలో నిర్మించాలని తలపెట్టిన ఫ్యూచర్ సిటీ కోసం అదనంగా 16 వేల ఎకరాలను సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ప్రభుత్వం దాదాపు 13,973 ఎకరాల భూమిని సిద్ధం చేసింది. దీనికి అదనంగా 16 వేల ఎకరాలకు పైగా భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించాలని సర్కారు నిర్ణయించింది. అంటే మొత్తం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేయనుంది. ఫ్యూచర్ సిటీ కోసం అదనంగా16 వేల ఎకరాలను ల్యాండ్ పూలింగ్ విధానంలో సేకరించనున్నారు.

# అదానీతో రేవంత్ రెడ్డి దందాను రాహుల్ సమర్థిస్తున్నారా?

(మొదటి పేజీ తరువాయి)

పారిశ్రామికవేత్తలు ఎవరూ ఊరికే విరాళాలు ఇవ్వరని మహారాష్ట్ర ఎన్నికల సభల్లో రాహుల్ గాంధీ చెప్పారు. "నీకిది, నాకది" అని ఏదో పెద్దదే ఆశించి ఇస్తారని అన్నారు. మరీ ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.100 కోట్లు అదానీ నుంచి విరాళం తీసుకుంది. రాహుల్ గాంధీకి తెలిసి తీసుకున్నారా? లేక తెలియకుండా తీసుకున్నారా? కాంగ్రెస్ జాతీయ పార్టీ. దానికి దేశవ్యాప్తంగా ఒక్కటే విధానం ఉండాలి కదా? కానీ ఢిల్లీలో అదానీ మంచివాడు కాదు%% గల్లీలో మాత్రం అదానీ మంచోడు. కాంగ్రెస్ పార్టీది గల్లీలో ఒక నీతి%% ఢిల్లీలో మరో నీతి? బీజేపీది డబుల్ ఇంజిన్ అంటున్నారు. మరి కాంగ్రెస్‌ది డబుల్ స్టాండర్డ్స్? కాదా అని కేటీఆర్ ప్రశ్నించారు.అదానీ వ్యవహారంలో కాంగ్రెస్ వాళు గుడ్ అదానీ, బ్యాడ్ అదానీ అనే విధానం పాటిస్తున్నారు. వాళ్ల పార్టీకి చందాలు ఇచ్చి ఆర్థికంగా సాయం చేస్తే గుడ్ అదానీ అంటారు. అది వేరే పార్టీలతో కలిసి వ్యాపారాలు చేస్తే బ్యాడ్ అదానీ అంటారు. తెలంగాణలో అదానీతో రేవంత్ రెడ్డి దందాను రాహుల్ గాంధీ సమర్థిస్తున్నారా? తెలంగాణ కన్నా తక్కువ తలసరి ఆదాయం ఉన్న కెన్యా ప్రభుత్వం ఆత్మగౌరవంతో వ్యవహరించింది. అదానీ మీద అమెరికాలో కోర్టు తీర్పు ఇవ్వగానే, అదానీతో వ్యాపార సంబంధాలను రద్దు చేస్తామని కెన్యా అధ్యక్షుడు ప్రకటించారు. రాహుల్ గాంధీ మాత్రం అదానీ దుర్మార్గుడు అంటారు. మరి కెన్యా ఒప్పందాలు రద్దు చేసుకుంటే మీరు ఎందుకు రద్దు చేయటం లేదు? అదానీ నుంచి రూ.12,400 కోట్ల వ్యాపార ఒప్పందాలు చేసుకున్నారని కేటీఆర్ గుర్తు చేశారు. రాహుల్ గాంధీ వెంటనే మీ ముఖ్యమంత్రికి ఫోన్ చేసి అదానీతో ఒప్పందాలు రద్దు చేయమని ఆదేశించాలి. ప్రధానితో అదానీ దోస్తీని విమర్శించే రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డి అదానీతో దోస్తీ చేస్తే ఎందుకు ఊరుకుంటున్నారు? అదానీతో వ్యాపారం దేశానికి నష్టమని రాహుల్ గాంధీ అంటారు. మరి తెలంగాణకు ఏ విధంగా మేలు జరిగిందో చెప్పాలి. కాంగ్రెస్ హైకమాండ్‌ను కాదని తెలంగాణలో అదానీకి రెడ్ కార్పెట్ వేశారా? అలాగైతే కాంగ్రెస్ పరంగా అది చాలా నష్టం చేసే పని. వెంటనే రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలి. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల కూడా అదానీతో ఒప్పందాలను పునసమీక్షించాలని కోరారని కేటీఆర్ గుర్తు చేశారు.స్కిల్ యూనివర్సిటీకి విరాళం సరియైనదేనని రాహుల్ గాంధీ భావిస్తున్నారా? అదానీ అవినీతి పరుడని రాహుల్ గాంధీ అంటుంటారు. అలాంటి వ్యక్తితో వ్యాపారం ఎందుకు చేస్తున్నారు? ఇదంతా రాహుల్ గాంధీకి తెలిసే జరుగుతుందని భావిస్తున్నాం. రేవంత్ రెడ్డి గారిపై వెంటనే చర్యలు తీసుకోండి. స్కిల్ యూనివర్సిటీకి ఇచ్చిన వంద కోట్లు వెనక్కి ఇవ్వండి. రామన్నపేటలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి ప్రజాభిప్రాయ సేకరణకు ప్రజలు వ్యతిరేకిస్తుంటే కాంగ్రెస్, బీజేపీ ఎందుకు నోరు విప్పడం లేదు? దేశం ప్రతిష్ట మంటగలిసిపోతే బీజేపీ ఎందుకు స్పందించటం లేదు? బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ ప్రయోజనాల కోసం నిజమైన పోరాటం చేస్తోంది. అదానీ వ్యవహారంపై ప్రధాని మోడీ, రాహుల్ గాంధీ వెంటనే స్పందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఇంట్లో నాలుగు గంటల పాటు అదానీ సమావేశమయ్యారు. అదానీ వ్యాపార విస్తరణ తెలంగాణలో ఇంత జరుగుతుంటే కాంగ్రెస్ హైకమాండ్‌కు తెలియదా? చిన్న కార్పొరేషన్ పదవికి కూడా కాంగ్రెస్‌లో హైకమాండ్ పర్మిషన్ కావాలి. మంత్రి వర్గ విస్తరణకు కూడా ఇప్పటివరకు హైకమాండ్ పర్మిషన్ ఇవ్వలేదు. అలాంటప్పుడు అదానీతో ఒప్పందాలకు కాంగ్రెస్ హైకమాండ్ పర్మిషన్ లేదని భావించాలా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

# భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు గొప్పవి

(మొదటి పేజీ తరువాయి)




ఇదే మన బలం, ఇదే మన స్థైర్యం అని తెలిపారు. ఇన్ని భిన్న సంస్కృతులు ఒకేచోట ఉండటం నిజంగా చాలా గొప్ప విషయం అన్నారు. ఇవన్నీ కలిసిన సుందరమైన ఇంద్రధనస్సు లాంటి దేశం మనదన్నారు. వనవాసి, నగరవాసి అని లోకమంథన్ కార్యక్రమంలో.. అహల్యాబాయ్ హోల్కర్, రాణి రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి వీరాంగనల పై ప్రదర్శనలు నిర్వహిస్తున్నారని తెలిసి హర్షం వ్యక్తం చేశారు. వారి ప్రేరణ ఎప్పటికీ మనకు అవసరం అన్నారు. విదేశాల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తుండటం అభినందనీయం అన్నారు. ఇండోనేషియా సహా వివిధ దేశాల ప్రతినిధులు ఈ వేదిక ద్వారా తమ సంస్కృతిని ప్రదర్శిస్తుండటాన్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని తెలిపారు. భారతదేశ ఆధ్యాత్మిక భావనలు, కళలు, సంగీతలు, విద్య, వైద్య విధానాలు ప్రపంచవ్యాప్తంగా గౌరవాన్ని పొందాయన్నారు. ప్రపంచానికి మనం జ్ఞాన దర్శనం చేశామన్నారు. ప్రపంచమంతా ప్రస్తుత సమయంలో మళ్లీ భారతదేశ జ్ఞానాన్ని పంచాల్సిన అవసరం ఏర్పడింది. విదేశీ శక్తులు శతాబ్దాలుగా మన మీద జులూం ప్రదర్శించాయి. మన సంస్కృతిని, భాషను, సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను విధ్వంసం చేశాయి. మనలో ఐకమత్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించారని తెలిపారు. మనలో బానిస మూలాలను చొప్పించారన్నారు. కానీ మన దేశ ప్రజలు సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ.. వీటిని నిరంతరం జీవింపజేశారన్నారు. ఇకపైనా వీటిని కొనసాగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. భారతదేశం బానిసత్వ మూలాలను తొలగించుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. రాజ్ పథ్ పేరు కర్తవ్యపథ్ మారిందన్నారు. దర్బార్ హాల్ పేరు.. గణతంత్ర మండప్ గా మార్చామన్నారు. ఇది బానిసత్వ ఆలోచనలను తొలగించే దిశగా జరుగుతున్న ప్రయత్నం అన్నారు. మన ఆలోచనలు కూడా మారాలని తెలిపారు. ఇటీవల.. ఓ హైకోర్టులో మహిళా జడ్జి విగ్రహాన్ని ప్రారంభించారన్నారు. కానీ ఆ విగ్రహం కళ్లకు నల్లని గంతల కట్టలేదని, ఇది మనం సాధిస్తున్న మార్పుకు సంకేతం అన్నారు. మన ఆలోచనలు కూడా మారాలని తెలిపారు. అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలమన్నారు. ఐకమత్యం, సమరసతే మన సభ్యత.. మన భవిష్యత్తు అన్నారు. ఈ దిశగా మనమంతా కలిసి పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. లోక్ మంథన్ కార్యక్రమం అనంతరం బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుగు ప్రయాణం అయ్యారు. నేటితో రాష్ట్రపతి రెండు రోజుల పర్యటన ముగిండి.

# ప్రత్యేక విభాగం హైడ్రా! జీహెచ్ఎంసీలో బాగం కాదు

(మొదటి పేజీ తరువాయి)

'ఐఎండీ 1875లో ఏర్పడింది. హైడ్రా జీహెచ్ఎంసీలో భాగం కాదు. ఇది వరకు ఈవీడీఎం పేరుతో జీహెచ్ఎంసీలో భాగంగా ఉండేది.. అప్పుడు ఐఏఎస్‌లు, కమిషనర్లు ఉండేవారు. ఇప్పుడు సెపరేట్ వింగ్‌గా ఏర్పడింది. హైడ్రాకు మొదటి కమిషనర్‌గా ఉండటం సంతోషంగా ఉంది.దేశంలోనే మొదటి సారి హైడ్రా తీసుకొచ్చారు. కేవలం జీహెచ్ఎంసీలో మాత్రమే కాకుండా చుట్టుపక్కల ఉన్న మరో 27 మునిసిపాలిటీల పరిధిలో హైడ్రా పనిచేస్తుంది.. వాటర్ బాడీస్, గవర్నమెంట్ ల్యాండ్స్, పబ్లిక్ అసెట్స్, లేక్స్ ఆక్రమణలకు గురవుతున్నాయి.. వాటికోసం హైడ్రా పనిచేస్తుంది. హైదరాబాద్ అంటేనే గొలుసు కట్టు చెరువులు.. ఒక చెరువుకు మరో చెరువుకు కనెక్టివిటీ ఉండేది..ఇప్పుడు కనెక్టివిటీ లేదు. నాలాలు కూడా సరిగా లేవు. గట్టి వర్షం పడితే ముంపుకు గురవుతాయి..దివి సీమ ఉప్పెన వచ్చినప్పుడు 10వేల మంది చనిపోయారు. పేదరికం వల్ల చాలామంది ముందస్తు సమాచారం లేకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోయారు.'ఐఎండీ వల్ల ముందే ఊహించగలుగుతున్నారు.. డిజాస్టర్స్‌లో కూడా మార్పులు వస్తున్నాయి..దేశంలో అర్బనైజేషన్ పెరుగుతుంది.తెలంగాణలో అర్బనైజేషన్ పెరుగుతుంది. వెహికిల్ పాపులేషన్ 80 లక్షలుగా ఉంది. సిటీ ట్రాఫిక్ అడిషనల్ సీపీగా కూడా ఉన్నాను. 2, 3 సెంటిమీటర్ల వర్షం పడితే మూడు, నాలుగు గంటలు ట్రాఫిక్ జామ్ అవుతుంది. మెట్రో సిటీలలో వాతావరణ మార్పులు ఎక్కువగా ఉన్నాయి. క్లౌడ్ బరస్ట్ కూడా పెరుగుతున్నాయి. నాలాలు, చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి.. వర్షం పడినప్పుడు వరద నీరు ఇంకడానికి చాలా సమయం పడుతుంది. సాయంత్రం 4, 5 గంటలకు వర్షం పడితే భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది.. ఆ నీరు ఇంకడానికి మార్గాలు లేవు.. సిటీలో 150 వాటర్ లాగింగ్స్ ఉన్నాయి. అర్బన్ డిజాస్టర్‌ల మీద ఫోకస్ పెట్టాలి.157 ఏడబ్ల్యూఎస్ స్టేషన్స్ ఉన్నాయి.. ఇంకా కావాలి. ప్రతి 15నిమిషాలకు బెంగుళూరులో ఏడబ్ల్యూఎస్ స్టేషన్‌ల నుంచి డేటా కలెక్ట్ చేస్తారు.. మనం కూడా దీనికి మారాలి. సిటీలో వెదర్ రెడర్స్ కావాలి..జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి హిల్ ఏరియాల్లో పెట్టాల్సిన అవసరం ఉంది. వెదర్ అలర్ట్స్ స్పెసిఫిక్‌గా ఉండాలి. ఇక్కడ వర్షం పడుతుందని కాకుండా ఇక్కడ పడదని చెప్పేలా వెదర్ అలర్ట్స్ ఉండాలి. వర్షాలు పడుతున్నపుడు గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడం వల్ల ఎకనామికల్ లాస్ కూడా ఏర్పడుతుంది..హైడ్రా, ఐఎండీతో కలిసి పనిచేస్తుంది. అర్బన్ డిజాస్టర్స్ కో సంబంధించి ఐఎండీతో కలిసి పనిచేస్తుంది. నేను మెకానికల్ ఇంజనీర్‌ని, అయినా వీటి గురించి తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాను. ప్రజలు వెదర్ అలర్ట్స్‌ని సీరియస్‌గా తీసుకునేలా హైడ్రా పని చేస్తుందని కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు.

# హైదరాబాద్ ఫార్మాసిటీలో భారీగా పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)



ఈ క్రమంలోనే దేశంలో పేరొందిన ఫార్మా కంపెనీలు హైదరాబాద్ మహానగరంలో భారీ పెట్టుబడులకు ముందుకు వచ్చాయి. తమ కంపెనీల కార్యకలాపాల విస్తరణతో పాటు కాలుష్య రహితంగా ఏర్పాటు చేసే గ్రీన్ ఫార్మా కంపెనీలను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వివిధ ఫార్మా కంపెనీల ప్రతినిధులు శుక్రవారం(నవంబర్ 22) రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్?బాబుతో సమావేశమయ్యారు. ఎంఎస్ఎన్ గ్రూప్, లారస్ ల్యాబ్స్, గ్లాండ్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ లాబోరేటరీస్, అరబిందో ఫార్మా, హెటిరో ల్యాబ్స్ కంపెనీల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఫార్మా కంపెనీల ప్రతినిధులు తమ పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన ఎంవోయూలపై సంతకాలు చేశారు. ఈ ఆరు కంపెనీలు కలిసి దాదాపు రూ.5,260 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నాయి. వీటి ద్వారా ఫార్మా రంగంలో 12,490 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఇప్పటికే ప్రభుత్వం గుర్తించిన ఫార్మా సిటీలో వీటికి అవసరమైన యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించనుంది.ఎంవోయూల ఒప్పందాల ప్రకారం ఎంఎస్ఎన్ లాబొరేటరీ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ తో పాటు ఆర్ అండ్ డీ సెంటర్ నెలకొల్పనుంది. లారస్ ల్యాబ్స్, అరబిందో ఫార్మా ఫార్ములేషన్ యూనిట్లు నెలకొల్పుతాయి. గ్లాండ్ పార్మా ఆర్ అండ్ డీ సెంటర్, ఇంజెక్టబుల్స్, డ్రగ్ సబ్స్టన్స్ మాన్యుఫాక్చర్ యూనిట్లను స్థాపించనుంది. డాక్టర్ రెడ్డీస్ లాబ్స్ ఇంజెక్టబుల్, బయో సిమిలర్ల యూనిట్ ఏర్పాటు చేస్తుంది. హెటిరో ల్యాబ్స్ ఫినిషిడ్ డోస్, ఇంజక్టబుల్ తయారీ పరిశ్రమ నెలకొల్పనుంది. మరో నాలుగు నెలల్లో ఫార్మా కంపెనీలు తమ నిర్మాణ పనులు చేపట్టేందుకు వీలుగా స్థలాలను కేటాయించటంతో పాటు, ఫార్మా సిటీలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కంపెనీలు ఫార్మా సిటీలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు రెడీ కాగా.. పరిశ్రమల స్థాపనకు తమ ప్రభుత్వం అనుకూల వాతావరణం సృష్టిస్తుందని మంత్రి తెలిపారు.

# కేబినెట్ విస్తరణకు ప్రభుత్వం కసరత్తు

**మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల అనంతరం విస్తరణ!!**

**మైనారిటీలకు ప్రాధాన్యత ఇవ్వనున్న అధిష్టానం**

**యువతకు అధిక అవకాశాలు కల్పించాలని కసరత్తు**

**కొందరి శాఖలలలో మార్పు కూడా ఉండే అవకాశం**



హైదరాబాద్, నవంబర్ 22ప్రజావినికిడి:ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కేబినెట్ విస్తరణకు కౌంట్ డౌన్ స్టార్ట్ అయింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తుండటంతో దానికంటే ముందే ముహూర్తం ఫిక్స్ కానుంది. ఆ తర్వతా అసెంబ్లీ సమావేశాలు డిసెంబర్ 9 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో రైతు, కుల గణన సర్వే, మరియు ఆర్ ఓ ఆర్ చట్టంపై చర్చ జరగనుంది. ప్రభుత్వం ఇప్పటికే అనేక కీలక అంశాలను ఈ సమావేశాల్లో ముందుకు తీసుకురావడానికి సిద్ధమవుతోంది.డిసెంబర్ 7తో రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన పదవీకాలంలో ఏడాది పూర్తి చేయనుంది. ఈ సందర్భంగా మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల అనంతరం ఈ ప్రక్రియ వేగం పుంజుకోనుందని తెలుస్తోంది. నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి వంటి జిల్లాలకు ప్రస్తుతం కేబినెట్‌లో ప్రాతినిధ్యం లేకపోవడం, విస్తరణను మరింత కీలకంగా మారుస్తోంది.ఈ మంత్రివర్గ విస్తరణలో మైనారిటీలకు ప్రాధాన్యత ఇవ్వాలని, యువతకు అధిక అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యంగా ముదిరాజ్ సామాజిక వర్గానికి ఒక బెర్త్ కచ్చితంగా ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు. విస్తరణలో తోడుగా కొన్ని శాఖల మార్పు కూడా ఉండే అవకాశం ఉంది. మొత్తం 6 మంత్రివర్గ స్థానాల కోసం 10 మంది ఎమ్మెల్యేలు పోటీ పడుతున్నారు. అదిలాబాద్ నుంచి ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వివేక్, గడ్డం వినోద్‌బీ నిజామాబాద్ నుంచి సుదర్శన్ రెడ్డి, మదన్ మోహన్ రావుబీ మహబూబ్ నగర్ మక్తల్ నుండి వాకిటి శ్రీహరి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఎస్టీ కోటాలో బాలునాయక్, నల్గొండ జిల్లాలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బలమైన ఆశావహులుగా ఉన్నారు.ఇదిలా ఉంటే రాష్ట్రంలో త్వరలోనే పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. ఆసరా పెన్షన్, రైతు భరోసా వంటి పథకాల అమలుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ పథకాలు ప్రజల్లో ప్రభుత్వం పై నమ్మకాన్ని పెంచేందుకు దోహదపడతాయని భావిస్తోంది. ఇదిలా ఉంటే కొండపోచమ్మ సాగర్ సమీపంలోని హరీష్ రావు ఫాం హౌస్ పై విచారణను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ చర్యతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కనుంది. ఇవన్ని రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారాయి . డిసెంబర్ సమావేశాలు, మంత్రివర్గ విస్తరణపై అందరి పోకస్ ఉంది.

# ఇన్ఫార్మర్ నెపంతో అన్నదమ్ముల దారుణ హత్య

## ములుగు జిల్లాలో మావోయిస్టుల ఘాతుకం

ములుగునవంబర్ 22ప్రజావినికిడి:
ములుగు జిల్లా మరోసారి ఉలిక్కిపడింది. ఇన్ ఫార్మర్ల నెపంతో మావోయిస్టులు ఇద్దరు అన్నదమ్ములను దారుణ హత్య చేశారు. వాళ్లిద్దరినీ గొడ్డళ్లతో నరికి చంపడంతో పాటు సీపీఐ మావోయిస్టు పార్టీ వెంకటాపురం%-% వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరున లేఖ కూడా రిలీజ్ చేశారు. ములుగు జిల్లాలో మావోయిస్టులు రెచ్చిపోయారు. ఇన్‌ఫార్మర్‌ల పేరుతో అన్నదమ్ములను నరికి చంపారు. అన్నదమ్ములు ఇద్దరినీ దారుణంగా హతమార్చడంతో ములుగు జిల్లాలో ఒక్కసారిగా భీకర వాతావరణం నెలకొంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ములుగు జిల్లా వాజేడు మండలంలోని పెనుగోలు కాలనీలో ఉంటున్న ఉయిక రమేశ్ పేరూరు పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తుండేవాడు. అతని తమ్ముడు ఉయిక అర్జున్ స్థానికంగా పశువులను మేపుకుంటూ ఉండేవాడు. కాగా ఉయిక అర్జున్ కొద్దిరోజులుగా ఇన్ ఫార్మర్ గా మారి పోలీసులకు సమాచారం చేర వేస్తున్నట్లు మావోయిస్టులు అనుమానించారు. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి కొంతమంది మావోయిస్టులు గ్రామంలోకి చొరబడి ఉయిక రమేష్ తో పాటు ఉయిక అర్జన్ ను వేట గొడ్డళ్లతో దారుణంగా హత్య



చేశారు. దీంతో ములుగు జిల్లాలో కలకలం చెల రేగింది. విషయం తెలుసుకున్న పోలీసు వర్గాల్లో కూడా అలజడి మొదలైంది. అన్నదమ్ములను హత్య చేసిన అనంతరం భారత కమ్యూనిస్ట్ మావోయిస్ట్ పార్టీ వెంకటాపురం వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరున లేఖ కూడా రిలీజ్ చేశారు. దాని సారాంశం ప్రకారం.. ములుగు జిల్లా వాజేడు మండలం పెనుగోలు గ్రామానికి చెందిన ఉయికె అర్జున్ గ్రామంలో ఉంటూ పోలీస్ ఇన్ ఫార్మర్ గా మారాడు. అతను వాజేడు మండలంలో ఉంటున్నాడు. అతను షికారు పేరుతో చేపల వేటతో పాటు పశువులను మేపే పేరుతో అడవికి వెళ్లి అంతా తిరిగేవాడు. అక్కడ మావోయిస్టుల దళం మకాంలు, కదలికలు గమనించి స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తున్నట్టు మావోయిస్టు పార్టీ నేతలకు అనుమానం కలిగింది. దీంతో పద్ధతి మార్చుకోవాల్సిందిగా చెప్పినా వినడం లేదని పేర్కొంటూ.. అదే కారణంతో ఉయికె అర్జున్ ను ఖతం చేస్తున్నాం అంటూ లేఖలో పేర్కొన్నారు. ఉయికె అర్జున్ ను హతమార్చేందుకు మావోయిస్టులు అతడిని తీసుకెళ్లగా.. అడ్డుకునేందుకు వెళ్లిన అన్న రమేష్ ను కూడా మావోలు గొడ్డలి వేటుతో హత మార్చారని స్థానికులు చెబుతున్నారు. కాగా ఇద్దరు అన్నదమ్ముల హత్యతో ములుగు జిల్లా మరోసారి ఉలిక్కిపడగా.. పోలీసులు అలర్ట్ అయ్యారు. గ్రామంలో పోలీసులు మోహరించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. స్థానికులు ఎవరూ భయాందోళనకు గురి కావొద్దని సూచిస్తున్నారు. కాగా జిల్లాలో కొద్దిరోజులుగా మావోయిస్టుల కదలికలు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందగా.. ఇప్పటికే నిఘా పెంచారు. అయినా గురువారం అర్ధ రాత్రి అన్న దమ్ముల హత్య జరగడంతో రాష్ట్రంలో మావోయిస్టులు మరోసారి ఉనికి చాటుకున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు ఈ ఘటనపై వివరాలు సేకరిస్తున్నారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ప్రజలకు సూచిస్తున్నారు.

# కోడలి వివాహ పనుల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బిజీ..

**ప్రముఖులకు ఆహ్వానాలు స్వయంగా అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్..**

**అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్,మంత్రి శ్రీధర్ బాబులకు ఆహ్వానం.**





ప్రజావినికిడి,(షాద్ నగర్): కోడలి వివాహ పనులు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బిజీగా ఉన్నారు.ఈనెల 24వ తేదీ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని రోస్ గార్డెన్ లో జరగబోతున్న స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోడలు సౌమ్య వివాహానికి సంబంధించి పలువురు ప్రముఖులను ఎమ్మెల్యే శంకర్ స్వయంగా ఆహ్వానిస్తున్నారు. తాజాగా ఎమ్మెల్యే శంకర్ శుక్రవారం తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, అదేవిధంగా రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబులు స్వయంగా కలిసి శుభలేఖలు అందజేశారు.షాద్ నగర్ పట్టణంలో ఈనెల 24వ తేదీన జరుగుతున్న వివాహానికి సకుటుంబ సపరివార సమేతంగా హాజరుకావాలని వారిని ఎమ్మెల్యే ఆహ్వానించారు.తన కోడలు సౌమ్య వివాహం కోసం ఎమ్మెల్యే శంకర్ స్వయంగా ప్రముఖులను ఆహ్వానిస్తుండటం విశేషం. ఓవైపు రాజకీయంగా, పాలనాపరంగా బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ కుటుంబ పనుల కోసం ఆయన ప్రత్యేకంగా సమయం కేటాయించడం విశేషం..

# రేవంత్ రెడ్డి తలకాయ లేని ముఖ్యమంత్రి

**అబద్దాలు చెప్పడం ముఖ్యమంత్రికి అలవాటైనది -గ్యారెంటీలు అమలు చేయనందుకు ముక్కు నేలకు రాయి**

**తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్, రేవంత్ క్షమాపణ చెప్పాలి -మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే రావాలంటున్న రైతులు**

**రైతులందరూ కళ్ళల్లో నీళ్లు పెట్టుకుని బాధపడుతున్నారు -మార్పు మార్పు అని ఊదరగొట్టింది కాంగ్రెస్ పార్టీ**

**ఏం మార్పు వచ్చింది? .. అన్ని పథకాలు బంద్ -మాజీ మంత్రి హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు**

హైదరాబాద్, నవంబర్ 22ప్రజావినికిడి::
హైదరాబాద్‌కు మూడు దిక్కుల సముద్రం ఉందని చెప్పిన తలకాయ లేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. నోటికి ఏది వస్తే అది మాట్లాడడం.. అబద్దాలు చెప్పడం ముఖ్యమంత్రికి అలవాటు అయిపోయిందని మండిపడ్డారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. గ్యారెంటీలు అమలు చేయనందుకు ముక్కు నేలకు రాసి తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి. కరోనా కష్టకాలంలో కూడా మంత్రుల ఎమ్మెల్యేల జీతాలు బందు పెట్టి రైతులకు రైతుబంధు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వం. రూ. 15000 రైతుబంధు ఇస్తామని చెప్పి ఉన్న రూ. 10000 కూడా ఎగ్గొట్టిండు రేవంత్ రెడ్డి. ఇది ఏంటి అని ప్రశ్నిస్తే కేసులు పెట్టడం. ప్రతిపక్షాల గొంతు నొక్కడం వంటివి చేస్తున్నాడు. ఇగురం లేనోడు వ్యవసాయం చేస్తే వడ్లు వాగులో గడ్డి గాళ్ళలో కొట్టుకుపోయింది అంట. ఈ రేవంత్ రెడ్డి పాలన ఇట్లనే ఉన్నది. అందుకే నువ్వు ఎనుముల రేవంత్ రెడ్డి కాదు ఎగవేతల రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు విమర్శించారు. అదానీ గురించి ఢిల్లీ కాంగ్రెస్ ఒక మాట గల్లీ కాంగ్రెస్ ఒక్క మాట. రాహుల్ గాంధీ ఏమో అదానీని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నాడు. అదానీ నుండి రూ. 100 కోట్ల చెక్కు తీసుకున్న రేవంత్ రెడ్డిని ఏం చేయాలో రాహుల్ గాంధీ చెప్పాలి. అంతర్గత ఒప్పందాలతో కాంగ్రెస్ పార్టీ డ్రామాలు చేస్తున్నది. కేసీఆర్ ఉన్నప్పుడు అదానీ అనేవాడు తెలంగాణకు రాగలిగాడా? ఒక రూపాయి అయినా తెలంగాణలో పెట్టుబడి పెట్టగలిగాడా? అవినీతి ఆరోపణలతో అమెరికాలో అదానీని అరెస్టు చేయాలని చూస్తున్నారు. అలాంటి అదానీతో లోపాయికారీ ఒప్పందం చేసుకుంది రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఖమ్మం మార్కెట్ యార్డులో వెళ్ళినప్పుడు రైతులందరూ కళ్ళల్లో నీళ్లు పెట్టుకుని బాధపడుతున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. మళ్లీ కేసీఆర్ సార్ ప్రభుత్వమే రావాలి అని ఖమ్మం రైతులు చెప్తున్నారని ఆయన పేర్కొన్నారు. మార్పు మార్పు అని ఊదరగొట్టింది కాంగ్రెస్ పార్టీ. ఏం మార్పు వచ్చింది? రైతుబంధు, బతుకమ్మ చీరలు, గర్భిణీ స్త్రీలకు న్యూట్రిషన్ కిట్, కేసీఆర్ కిట్, దళిత బంధు, గొర్రె పిల్లల పంపిణీ, బీసీ



బంధు.. ఇలా అన్నీ బంద్ అయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. కాంగ్రెస్ పార్టీ మొట్టమొదటి హామీ మహిళలకు రూ. 2500 ఇస్తామని గ్యారెంటీ ఇచ్చారు. భట్టి విక్రమార్క ఇంటింటికి బాండ్ పేపర్ మీద రాసి హామీ ఇచ్చాడు. ఒక్కొక్క మహిళకు రూ. 27500 కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడింది ఈ 11 నెలల్లో. మహిళల ఓట్లు దండుకొని మోసం చేశారు. కల్యాణ లక్ష్మి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం అని మోసం చేశారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కేసీఆర్ ఎన్నికల్లో ఇవ్వని హామీలను కూడా అమలు చేశారు. కళ్యాణ లక్ష్మి ఎన్నికల్లో హామీ ఇవ్వకుండా అమలు చేసి చూపించాడు కేసీఆర్. లక్ష రూపాయలు ఆడబిడ్డ పెళ్లికి అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. గత 11 నెలల్లో తెలంగాణలో 6 లక్షల పెళ్లిళ్లు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ ఆరు లక్షల తులాల బంగారం బాకీ పడింది. బస్సు తప్ప అంత తుస్సే. బస్సు సర్వీసులు తగ్గించి ఆడబిడ్డలను ఇబ్బంది పెడుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వం అని హరీశ్‌రావు మండిపడ్డారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని దేవుని మీద ఒట్టు పెట్టి మోసం చేసిండు రేవంత్ రెడ్డి. ఏ ముఖ్యమంత్రి అయినా దేవుడి మీద ఒట్టు పెట్టి మాట తప్పుతారా? పాలకులు పాపం చేస్తే ప్రజలకు నష్టం జరుగుతుందని అయ్యగారు చెప్తే నేను దేవాలయాలకు వెళ్ళాను. రేవంత్ రెడ్డి పంద్రాగస్టులోపు రుణమాఫీ చేస్తానని ఒట్టు పెట్టి మోసం చేశాడని పాపపరిహారం చేశాను.అయితే తిట్లు లేదంటే దేవుని మీద ఓట్లు అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఒక రైతుకైనా సన్నరకం వడ్లకు బోనస్ వచ్చిందా..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అడిగారు. సకాలంలో మిల్లులు అనుసంధానం చేయకపోవడం, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, గన్నీ బ్యాగులు ఇవ్వకపోవడం వల్ల ధాన్యం దళారుల పాలైందని హరీశ్‌రావు తెలిపారు. శంకర్, రమాదేవి అనే రైతులు 8 ఎకరాల్లో పత్తి పండిస్తే, కనీసం 5 క్వింటాళ్ల పంట కూడా రాలేదని, వచ్చిన దానికి కూడా మద్దతు ధర ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2021లో రూ.11,000కు పత్తి కొనుగోలు చేయడం జరిగింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎందుకు సగానికి సగం పత్తి ధర పడిపోయింది? ఇది దళారుల దోపిడీ వల్లే. రూ.7,520 మద్దతు ధరను పత్తి రైతులకు ఇవ్వాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.రైతులకు కనీసం రూ.500 బోనస్ ఇవ్వాలని కూడా డిమాండ్ చేస్తున్నాం. దళారులు రూ.6,500కు పత్తి కొనుగోలు చేసి, సీసీఐ కేంద్రాలకు రూ.7,500కు అమ్ముతున్నారు. మిర్చి రైతులను కూడా ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసింది. గత సంవత్సరం రూ.23,000 మద్దతు ధర వస్తే, ఈసారి రూ.13,000 కూడా రావడం లేదు. మాయమాటలు చెప్పి రైతులను నట్టేట ముంచడం మంచిది కాదు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అని హరీశ్‌రావు మండిపడ్డారు. రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేశారు. రూ.15,000 రైతు భరోసాను ఇవ్వమని మోసం చేశారు. రూ.15,000 కౌలు రైతులకు ఇస్తామని మోసం చేశారు. రూ.12,000 రైతు కూలీలకు ఇస్తామని మోసం చేశారు. రూ.500 బోనస్ ఇస్తామని కూడా మోసం చేశారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా, ప్రజా సమస్యలు పట్టించుకునే పరిస్థితిలో లేరు. ఒకరిపై ఒకరు పైచేయి కోసం పాకులాడడమే తప్ప, ప్రజా సమస్యల కోసం పనిచేయడం లేదు. 4 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరగం వడ్లు ఖమ్మం జిల్లాలో పండితే, ఇప్పటివరకు 19 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని హరీశ్‌రావు తెలిపారు.ముఖ్యమంత్రి మద్యం అమ్మకాలపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు, కానీ పత్తి వరి కొనుగోళ్లపై సమీక్ష చేయడం లేదు. మద్దతు ధరకు ధాన్యం కొనకపోతే, ఎవరికి మెమోలు జారీ చేయడం లేదు. తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా చేయాలని ముఖ్యమంత్రి కంకణం కట్టుకున్నారేమో. ఈరోజు పత్తి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా అన్ని రకాల పంటలకు మద్దతు ధరతో పాటు బోనస్ ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. పత్తిని రూ.7,500కు కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు తెలిపారు.

# రైతుల భూముల్లో ఫార్మాసిటీ ఏర్పాటు వద్దు

**సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**

హైదరాబాద్, నవంబర్ 22ప్రజావినికిడి:
రైతుల పంటలు పండించే భూముల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేయడాన్ని సీపీఐ వ్యతిరేకిస్తుంది. గిరిజనుల భూములు వారికే ప్రభుత్వం అప్పగించి ఫార్మాసిటీని జనావాసాలు లేని చోట ఏర్పాటు చేయాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి,కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లాకేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్



రెడ్డి, జిల్లా కార్యదర్శి మంద పవన్‌తో కలిసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ హిందూ ముస్లింల మధ్య గొడవలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నదన్నారు. లగచర్ల ఫార్మాసిటీని ఫోర్త్ సిటీగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రూ.2 లక్షల పైన పంట రుణమాఫీ పై కాంగ్రెస్ ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కానీ హామీలు ఇచ్చిందని, వీటిపై ప్రజలకు వివరించే ప్రయత్నం చేయాలని పార్టీ క్యాడర్‌కు ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ఏం చేసిందని, మరో నాలుగేండ్లలో ఏమి చేస్తారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాలను రాష్ట్రంలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో గడప మల్లేశ్, దయానంద్,జనార్దన్, బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆసిఫాబాద్ జిల్లాలో విషాదం..

**పురుగుల మందు తాగి పత్తి రైతు ఆత్మహత్య**

కుమ్రంభీం , నవంబర్ 22ప్రజావినికిడి: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పత్తి పంట దిగుబడి రాక.. ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన జైనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. జైనూర్ ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. జైనూర్ మండలం పట్నాపూర్ గ్రామానికి చెందిన రైతు దక్రే రాందాస్ తనకున్న రెండు ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. పత్తి పంట సరిగ్గా పండక పోవడంతో మనస్థాపం చెంది గురువారం సాయంత్రం గ్రామ శివారులోని రోడ్డు పక్కన పురుగు మందు తాగి స్పృహ కోల్పోయి పడి ఉండడంతో అతని భార్య శకుంతలతొ పాటు ఆమె మరిది దేవిదాస్ మరియు అల్లుడు కలసి రాందాస్ ను వెంటనే ఉట్నూరు హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో శుక్రవారం మృతుడి భార్య శకుంతల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

# సిఎం సొంత గ్రామంలో మాజీ సర్పంచ్ ఆత్మహత్య

**ముఖ్యమంత్రి సోదరులు భయపెడుతున్నారని సూసైడ్‌నోట్**

కల్వకుర్తి నవంబర్ 22ప్రజావినికిడి:
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చ పేట నియోజకవర్గం వం గూరు మండలంలో మాజీ సర్పంచ్ పాంకుంట సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం సంచల నం రేపింది. 40 ఏళ్ల కింద తాము నిర్మించుకున్న ఇం టికి దారి ఇవ్వకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు అడ్డుకుంటున్నారని, భయపెడుతున్నారని



ఆయన ఆరోపిస్తూ సూసైడ్ నో ట్ రాసి ఆత్మహత్య చే సుకున్నాడు. మృతుడు సాయిరెడ్డి సూసైడ్ నో ట్‌లో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వంగూ రు మండలం, కొండారెడ్డిపల్లి గ్రామానికి చెంది న నాలుగు దశాబ్దాల క్రితం గ్రామంలో ఇల్లు నిర్మించుకున్నానని తెలిపాడు.ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అతని సోదరులు గతంలో తన ఇంటికి వెళ్లకుండా ఇంటిముందు ప్రభుత్వ పశువుల దవాఖానా నిర్మించారని తెలిపాడు. తమ గ్రామానికి చెందిన ఎనముల రేవంత్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత అతని సోదరులు తనను చాలా ఇబ్బందులకు గురిచేశారని ఆ లేఖలో పేర్కొన్నాడు. గత కొంత కాలంగా తన ఇంటికి వెళ్లేందుకు దారి ఇవ్వకుండా ముఖ్యమంత్రి సోదరులు అడ్డుగా గోడ నిర్మించారని ఆవేదన వ్యక్తం చేశాడు. నాలుగు దశాబ్దాల కిందట నిర్మించుకున్న ఇంటికి దారి ఇవ్వకుండా తనను తీవ్ర మానసిక ఇబ్బందులకు గురిచేసిన ముఖ్యమంత్రి సోదరుల బాధ భరించలేక తాను ఆత్మహత్య చేసుకున్నట్లు సాయిరెడ్డి సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. కాగా, సాయిరెడ్డి ఆత్మహత్యకు సంబంధించి వంగూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన వివరాలు తెలియరాలేదు. అయితే తమకు ఎవరూ ఫిర్యాదు చేయనందున కేసు నమోదు చేయలేదని పోలీసులు చెబుతున్నారు.

# నేడు మహారాష్ట్ర, జార్ ఖండ్ ఎన్నికల ఫలితాలు

న్యూఢిల్లీ వంబర్ 22ప్రజావినికిడి::
మహారాష్ట్ర, జార్ ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వెల్లడికి రంగం సిద్ధమైంది. నేడు ఓట్ల కౌంటింగ్‌కు ఎన్నికల సంఘం అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుతో ప్రక్రియ ప్రారంభం కానుంది. 9 గంటల నుంచి ఫలితాల వెల్లడి ప్రారంభమవుతుందని ఎన్నికల అధికారులు తెలిపారు. జార?ండ్‌లో ఈ నెల 13, 20 తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ జరగగా, మహారాష్ట్రలో 20న ఒకే విడతలో 288 అసెంబ్లీ స్థానాలకు ఓటింగ్ ప్రక్రియ నిర్వహించారు. అధికార మహాయుతి(బిజెపి, శివసేన, ఎన్‌సిపి అజిత్ పవార్), విపక్ష మహా వికాస్ అగాఢీ(శివసేన ఉద్ధవ్, శరద్ పవార్ ఎన్‌సిపి, కాంగ్రెస్) కూటముల నడుమ



హోరాహోరీ పోరు జరిగినట్లు ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు అంచనా వేశాయి.
అయితే అధికార మహాయుతి వైపే ప్రజల మొగ్గు ఉన్నట్లు అత్యధిక సర్వేలు అభిప్రాయపడ్డాయి. మరోవైపు ఇక్కడ కాంగ్రెస్, శివసేన, ఎన్‌సిపి కూటమి కూడా ఈ సారి అధికారం తమదేనన్న ధీమాతో ఉన్నాయి. ఇక షిండే వర్గానికి చెందిన శివసేన ఎంఎల్‌ఎ సంజయ్ శీర్షత్ మళ్లీ అధికారంలోకి రాబోతున్నామని, షిండే తిరిగి ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. అయితే బిజెపికి చెందిన ప్రవీణ్ దరేకర్ మాత్రం ఈ సారి మహాయుతి అధికారంలోకి వస్తే డిప్యూటీ సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ సిఎం అవుతారని పేర్కొన్నారు. ఎన్‌సిపి నేత అమోల్ మిట్కారీ మాట్లాడుతూ డిప్యూటీ సిఎం అజిత్ పవార్‌కు ఈ సారి అత్యున్నత పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫలితాలు ఎలా ఉన్నా అజిత్ వర్గానిదే కింగ్‌మేకర్ పాత్ర అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# హలో కుమ్మర.. హలో బీసీ చలో హాలియా

## నిరసన కార్యక్రమం లో పాల్గొననున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న..


జర్నలిస్ట్ రాపోలు లింగస్వామి కుమ్మర

ప్రజావినికిడి,(ఎల్బీనగర్):
ఈనెల 24న తలపెట్టిన హలో కుమ్మర హలో బీసీ చలో హాలియా నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సామాజిక కార్యకర్త,సీనియర్ జర్నలిస్ట్ రాపోలు లింగస్వామి కుమ్మర పిలుపునిచ్చారు. నాగార్జున సాగర్ హాలియాలో జరిగిన మొల్లమాంబ ఘటనపై స్పందిస్తూ శుక్రవారం హైదరాబాద్ లో రాపోలు లింగస్వామి కుమ్మర ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ,హాలియాలో మొల్లమాంబ విగ్రహం ఏర్పాటు కు అనుమతి ఇచ్చినట్లే ఇచ్చి తొలగించడం అంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కుమ్మరుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే తప్పా మరోటి లేదన్నారు. విగ్రహం ఏర్పాటుకు అడ్డంకులు సృష్టించడం పట్ల తీవ్రంగా కండిస్తున్నామని, ఈనెల 24న,హలో కుమ్మర హలో బీసీ చలో హాలియా నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరువుతున్నారని కుమ్మరు లంతా ఏకమై బీసీ సంఘాలతో పెద్ద ఎత్తున హాజరై నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఓ ప్రకటనలో కోరారు.

# హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకోం..

## దుండగులను కఠినంగా శిక్షించాలి..

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి

ప్రజావినికిడి,(షాద్ నగర్):

జానంపేట లో గల వివేకానంద కాలనీ బస్వన్న దేవాలయం లో దుండగులు శివలింగాన్ని ద్వసం చేయడంపై బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించడం జరిగింది.విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో అనేక దేవాలయాల్లో విగ్రహాలను ద్వంసం చేయడం దారుణమని అన్నారు.మొన్న జరిగిన సంఘటన లో సికింద్రాబాద్, శంషాబాద్,బాల్ నగర్ లో విగ్రహాల ధ్వంసం పై రాష్ట్ర ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.విగ్రహాలను ధ్వంసం చేసి హిందువుల



మనోభావాలను దెబ్బ తీస్తే ఊరుకోమని హెచ్చరించారు. దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు.ఈ ఘటన పై విష్ణువర్ధన్ రెడ్డి సిఐతో మాట్లాడగా అతి త్వరలో దుండగులను పట్టుకొని కఠిన చర్యలు తీసుకుంటామని సి ఐ తెలపడం జరిగిందని అన్నారు.లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని విష్ణువర్ధన్ రెడ్డి హెచ్చరించడం జరిగింది.ఈ కార్యక్రమం లో మూలమఠం అమర్నాత్,చెట్ల వెంకటేష్,మోహన్ సింగ్,ఆకుల ప్రదీప్, రుమాండ్ల చంద్రశేఖర్, కమలాపురం రమేష్ రామాంజనేయులు, గుడాల రమేష్ తదితరులు ఉన్నారు.

# సయ్యద్ జమాల్ జహంగీర్ పుట్టిన రోజున అన్నదానం..



ప్రజావినికిడి, (నాంపల్లి):
టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్: ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్)ఆధ్వర్యంలో మెహదీ నవాబ్ జంగ్ క్యాన్సర్ ఆసుపత్రి ఆవరణలో సుమారు 600 నిరుపేద రోగుల సహాయకులకు మిత్రులు సయ్యద్ జమాల్ జహంగీర్ పుట్టిన రోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ మిత్రులు ముబా రజుద్దీన్ ముజహిద్,సయ్యద్ అసదుద్దీన్,టిఎన్జిఎస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కే.ఆర్.రాజ్ కుమార్,ఉపాధ్యక్షులు కుర్రాడి శ్రీనివాస్, సభ్యులు వైదిక్ శస్త్ర, కేంద్ర సంఘ సభ్యులు బొల్లిగిద్ద శంకర్, ఆసుపత్రి యూనిట్ కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా ఏపీఆర్ఓ మొహమ్మద్ వహీద్, మహమ్మద్ ముస్తఫా షరీఫ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సయ్యద్ జమాల్ జహంగీర్ మాట్లాడుతూ,తన పుట్టినరోజు సందర్భంగా అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా పేదలకు అన్నదాన కార్యక్రమం మరువ లేనిదన్నారు. మెమోరియల్ ట్రస్ట్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అనంతరం డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ,సయ్యద్ జమాల్ జహంగీర్ నిండు నూరేళ్లు ఆయు ఆరోగ్యాలతో ఉండాలని భగవంతున్ని కోరారు.



# ఎన్.జీ కాలేజీ లో ఘనంగా ప్రజా విజయోత్సవాలు.



ప్రజావినికిడి,(నల్గొండ): నల్లగొండ ఎన్.జీ కాలేజీ లో ఘనంగా సాగుతున్న ప్రజా విజయోత్సవాలు. హాజరైన రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలంగాణ కళా ప్రదర్శనలతో ఆకట్టుకున్న కళాకారులువేలాదిగా హాజరైన నల్గొండ ప్రజలు..

# వంశరాజ్ కులస్తులను పాత పేరుతో దూషిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు..



ప్రజావినికిడి,(హైదరాబాద్):తెలంగాణవెనుకబడిన తరగతుల కమిషన్ నిర్వహించిన బహిరంగ విచారణలో మా వంశరాజ్ రాష్ట్ర కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతిని గౌరవపూర్వకంగా స్వీకరించిన కమిషన్ ఛైర్మన్ గౌరవనీయులు జి.నిరంజన్ కు మా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.మా ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించి,పాత పేరును పూర్తిగా నిషేధించి,దూషించే వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకునేందుకు సిఫారసు చేస్తామని హామీ ఇవ్వడం మా మొత్తం వంశరాజ్ కులానికీ గౌరవం, న్యాయం కలిగించిన అంశంగాభావిస్తున్నాం. అదేవిధంగా,కమిషన్ సభ్యులు గౌరవనీయులైనరాయపోలు జయ ప్రకాష్ తిరుమలగిరి సురేందర్ బిశ్రీమతి బాల లక్ష్మి కిబీసీ కమిషన్ అధికారులకు అలాగే మన కుల సంఘము పెద్దలకు,అన్ని జిల్లాల్లో అభ్యర్థించిన నాయకులకు,పూర్వ నాయకులకు, వ్యవస్థాపకులకు, మాజీ అధ్యక్షులకు,పేరు పేరున ప్రతి పదాదికారులకు,గౌరవ సభ్యులందరికీమాప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాం అనిఇరిగిజ్జ మురళీ కృష్ణ రాష్ట్ర అధ్యక్షులుచిందం పాండు రాష్ట్ర ప్రధానకార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వంశరాజ్ కుల సంక్షేమ సంఘం నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి వీడ్కోలు పలికిన

## :జిహెచ్ఎంసి బీజేపీ కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్...!!!




ప్రజావినికిడి,(క్రొత్తపేట):గౌరవనీయులైన భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము తెలంగాణలో రెండు రోజుల పర్యటన ముగించుకొని తిరుగుపయనం వెళ్తుండగా శుక్రవారం రోజు ఉదయం బేగంపేట విమానాశ్రయంలో జిహెచ్ఎంసి బీజేపీ కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ వీడ్కోలు పలికారు.

# జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ను కలిసిన కార్పొరేటర్ పవన్ కుమార్.·

## పలుసమస్యల పైన వినతి..




ప్రజావినికిడి,(క్రొత్తపేట):శుక్రవారం రోజు ఎల్బీనగర్ సర్కిల్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ని కలిసి డివిజన్ సమస్యల పైన వినతి పత్రాన్ని అందజేసిన కొత్తపేట్ డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్కొత్తపేట డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో వున్నటువంటి సమస్యలపైన జోనల్ కమిషనర్ ని కలిసి వినతి పత్రాన్ని అందజేసిన కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోడి పవన్ కుమార్ భరత్ నగర్ ఫేస్ 1, మారుతి నగర్ స్వేత గార్డెన్స్ ఎదురుగా రోడ్డు,ఓల్డ్ మారుతి నగర్ గురు మందిర్ రోడ్డు మొత్తం పడైపోయాయని కాలనీ ప్రజలు నడవలేని స్థితిలో ఉన్నారని తెలియజేశారు, వెంటనే నూతన సీసీ రోడ్డును మంజూరు చేయాలని కమిషనర్ ని కార్పొరేటర్ కోరారు. మరియు కొత్తపేట డివిజన్ పరిదిలో వున్నటువంటి కాలనీలలో విద్యుత్ దీపాల కొరత ఎక్కువగా వున్నాయని వెంటనే వాటిపైన చర్యలు తీసుకోవాలని కోరారు. మరియు కాలనీలో వున్నటువంటి వివిధ సమస్యలను వివరించడం జరిగింది. జోనల్ కమిషనర్ వెంటనే స్పందించి సమస్యలపై చర్యలు తీసుకుంటామని త్వరలో డివిజన్ లో

# సాహెబ్ నగర్ గ్రామ రైతులతో ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి సమావేశం..



ప్రజావినికిడి,బి.యన్.రెడ్డి నగర్
డివిజన్ శివారు కాలనీల డ్రైనేజీ అవుట్ లెట్ కోసం సాహెబ్ నగర్ గ్రామ రైతులతో తన కార్యాలయంలో వారం రోజుల క్రితం సమావేశం నిర్వహించిన ఎల్బీనగర్ శాసనసభ్యుడు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి దానిలో భాగంగా రెండు రోజుల క్రితం తన కార్యాలయంలో ఎల్.బి.నగర్ జోన్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ యాదవ్ మరియు టౌన్ ప్లానింగ్ ఏ.సీ.పీ.శ్యామ్సన్ గార్లను తన కార్యాలయానికి పిలిపించడం జరిగింది.దానికి అనుగుణంగా ఈ రోజు దానికి సంబంధించిన ఇరిగేషన్ అధికారులచే మరోసారి తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ట్రంక్ లైన్ కోసం మలివిడత దాదాపు 2 కోట్ల రూపాయలు మంజూరు5 చేయించడం జరిగిందని,కాంట్రాక్టర్ కూడా ట్రంక్ లైన్ పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నారు కాబట్టి మరోసారి రాచకాలువ మొత్తం సర్వే చేయించి,యుద్ధ ప్రాతిపదికన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు రాచకాలువ సర్వే త్వరగా పూర్తి చేసి వచ్చే వర్షాకాలం లోపు ట్రంక్ లైన్ పనులు పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆదేశించారు.ఇట్టి కార్యక్రమంలో భారాస పార్టీ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి,ఇరిగేషన్ అధికారులు శుక్లాజ,సతీష్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి వల్ల అందిన ఎలక్ట్రికల్ ఆటో

## -ఆనందం వ్యక్తం చేసిన లబ్దిదారుడు మేథరి అశోక్



హైదరాబాద్, నవంబర్ 22ప్రజావినికిడి:
ముఖ్యమంత్రి ప్రజావాణి వల్ల హైదరాబాద్‌లోని ఎర్రగడ్డకు చెందిన ఎస్సీ యువకుడు మేథరి అశోక్ కు స్వయం ఉపాధి కోసం ఎలక్ట్రికల్ ఆటో సకాలంలో అందింది. శుక్రవారం మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి ఎలక్ట్రికల్ ఆటోను అశోక్ తీసుకువచ్చి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి, సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ లను ఎలక్ట్రికల్ ఆటోలో ఎక్కించుకుని అశోక్ సవారీ చేశారు. ఎలక్ట్రికల్ ఆటో పొందిన మేథరి అశోక్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613



భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి..



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి...

# అనంతుల సురేందర్ రెడ్డి కూతురు రిసెప్షన్ కు హాజరైన రాజకీయ ప్రముఖులు...

ప్రజావినికిడి,(ఎల్బీనగర్):
కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం సీనియర్ నాయకులు అనంతుల సురేందర్ రెడ్డి రెండో కూతురు జాన్వి రిసెప్షన్ యశ్వంత్ రెడ్డి గురువారం రాత్రి నగరంలోని ఓ కన్వెన్షన్లో ఘనంగా నిర్వహించారు. ఈ రిసెప్షన్ వేడుకలకు టీపిసిసి క్యాంపేనింగ్ కమిటి చైర్మన్ మాజీఎంపీ మధుయాష్కిగౌడ్, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి,నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్,కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి ఇతర ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.



హాజరైన టీపిసిసి క్యాంపేనింగ్ కమిటి చైర్మన్ మాజీఎంపీ మధుయాష్కిగౌడ్

# సువీ ఫ్యాషన్ టెక్స్టైల్స్ ప్రారంభోత్సవం..

ప్రజావినికిడి,(నాగోల్):
ఆనంద్ నగర్ లో నూతనంగా సువీ ఫ్యాషన్ టెక్స్టైల్స్ ను ప్రారంభించిన స్థానిక కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం షాప్ నిర్వాహకులు కార్పొరేటర్ కు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ, మహిళలకు కావలసి నటువంటి వస్త్రాలను తక్కువ ధరలలో ఈ ప్రాంత ప్రజలకు అందిస్తారని ఆమె అన్నారు. షాప్ నిర్వాహకులు సంగ సత్యం,సంగ మనోజ్ కుమార్ మాట్లాడుతూ, మా వద్ద మహిళలకు ప్రత్యేకమైనటువంటి మహిళలకు కాస్మెటిక్స్ మగ్గం వర్క్స్ గాజులు క్లిప్పులు పెట్టి కోర్స్ అన్ని డిజైన్లతో కూడినటువంటి వస్త్రాలను మహిళలకు అందిస్తామని షాప్ నిర్వాహకులు తెలిపారు.





## తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలించిన సిఎం రేవంత్ రెడ్డి

### పనులు జరుగుతున్న తీరు, అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి

హైదరాబాద్, నవంబర్ 22(జర్నలిస్ట్ జర్నీ న్యూస్):
రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు పనులను సిఎం రేవంత్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. విగ్రహ ఏర్పాటు పనులు చేస్తున్న కూలీలను సిఎం రేవంత్ రెడ్డి పలకరించారు. పనులు జరుగుతున్న తీరు, ఇతర వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ 9వ తేదీన సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సిఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. తెలంగాణ తల్లి విగ్రహ పనుల పరిశీలనను రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్టు చేశారు.రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో నాలుగు కోట్ల ప్రజల ప్రేమమూర్తి తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టాపనకు శరవేగంగా జరుగుతున్న పనులను ఈరోజు పరిశీలించానని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ పవిత్ర కార్యంలో పాలుపంచుకుంటున్న శ్రమ జీవులతో పనులు జరుగుతున్న తీరు ఇతర అంశాలపై కాసేపు ముచ్చటించానని సిఎం రేవంత్ ట్వీట్ చేశారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

## 10 మంది మావోయిస్టులు మృతి

**భెజ్జీ ప్రాంతంలో కాల్పుల పోరు - ఒడిశా మీదుగా ఛత్తీస్‌గఢ్‌లోకి నక్సల్స్ ప్రవేశం - సమాచారంతో డిఆర్‌జి ఆపరేషన్ - ఎన్‌కౌంటర్ జరిగినట్లు ఎస్‌పి కిరణ్ చవాన్ ధ్రువీకరణ**

రాయిపూర్ నవంబర్ 22ప్రజావినికిడి:
ఛత్తీస్‌గఢ్‌లోని కొంటాలో భద్రత దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పది మంది మావోయిస్టులు మరణించారు. భెజ్జీ ప్రాంతంలో శుక్రవారం తెల్లవారు జామున ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్లు పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్‌పి) కిరణ్ చవాన్ ధ్రువీకరించారు. ఘటన స్థలి నుంచి భద్రత దళాలు మూడు ఆటోమేటిక్ తుపాకులు సహా పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. ఒడిశా మీదుగా ఛత్తీస్‌గఢ్‌లోకి నక్సలైట్లు ప్రవేశిస్తున్నారనే పక్కా సమాచారంతో జిల్లా రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి) ఈ ఆపరేషన్ చేపట్టింది. కాగా, ఎన్‌కౌంటర్ జరిగినట్లు బస్తర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్



జనరల్ (ఐజి) పి సుందర్‌రాజ్ కూడా ధ్రువీకరించారు. అయితే, మృతుల సంఖ్య, స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను ఆయన వెల్లడించలేదు. ప్రస్తుతం ఇంకా కాల్పులు సాగుతూనే ఉన్నాయని 'పిటిఐ' వార్తా సంస్థ తెలియజేసింది. ఇది ఇలా ఉండగా, క్రితం నెల ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ దంతెవాడ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో 31 మంది మావోయిస్టులను భద్రత దళాలు కాల్చి చంపిన విషయం విదితమే. ఆ ఎన్‌కౌంటర్ సమయంలోను భద్రత దళాలు భారీ మొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి.

# తెలంగాణకు ఉత్తమ అంతర్గత మత్స్యకారుల జాతీయ అవార్డు




హైదరాబాద్, నవంబర్ 22ప్రజావినికిడి:
తెలంగాణ రాష్ట్రం 2024 సంవత్సరానికి ఉత్తమ అంతర్గత మత్స్యకారుల జాతీయ అవార్డును గెలుచుకుని గర్వంగా నిలిచింది. ఈ అవార్డు 2024లో మత్స్యశాఖ చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, అభివృద్ధి దృష్టికోణాన్ని గుర్తించి, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా కేంద్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేతుల మీదుగా ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అందుకున్నారు. ఈ అవార్డును మత్స్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, మత్స్యశాఖ డైరెక్టర్ ప్రియాంక ఆల అందుకున్నారు. ఈ పురస్కారాన్ని ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి అధికారికంగా అందించారు. తెలంగాణ మత్స్యశాఖ దేశంలో అగ్రగామిగా నిలిచింది. రాష్ట్రంలో 5,901 మత్స్య సహకార సంఘాలు 4,13,120 సభ్యులతో పనిచేస్తున్నాయి. డిసెంబర్ 2023 నుండి 225 కొత్త సంఘాలను ఏర్పాటు చేసి, 8,069 కొత్త సభ్యులను చేర్చడం ద్వారా సహకార సంఘాల విస్తరణను బలోపేతం చేసింది. బీమా పథకంలో 4.16 లక్షల మత్స్యకారుల జీవితాలను కాపాడటానికి రూ.139.77 లక్షల ప్రీమియం చెల్లించి ఆదర్శంగా నిలిచింది. కొత్త మత్స్య కుంటల నిర్మాణం కోసం రూ.2145.44 లక్షల వ్యయంతో 195.94 హెక్టార్లకు అనుమతులు మంజూరు చేయబడింది.మంచిర్యాల జిల్లా యెల్లంపల్లి జలాశయం వద్ద కొర్రమీను చేపల సంరక్షణ కోసం ప్రత్యేక కేంద్రాన్ని ఐసీఏఆర్-సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్‌వాటర్ అక్వాకల్చర్ సహకారంతో ఏర్పాటు చేయనున్నారు. రంగారెడ్డి జిల్లా కోహెడలో రూ.47.03 కోట్ల వ్యయంతో ఆధునిక మత్స్య మార్కెట్ నిర్మాణం జరుగుతోంది. 'ఇందిరా మహిళ శక్తి' పథకంలో 32 మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్లను 60% సబ్సిడీతో మహిళా సంఘాలకు అందచేయనున్నారు. ఈ ఏడాది 4.56 లక్షల టన్నుల మత్స్య ఉత్పత్తితో రూ.7059.04 కోట్ల ఆదాయాన్ని సాధించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో మత్స్యరంగం కీలక పాత్ర పోషించింది. ఈ విజయాలతో తెలంగాణ రాష్ట్రం దేశంలో మత్స్యరంగంలో నూతన ఒరవడులను సృష్టించి అగ్రస్థానంలో నిలిచింది.

# టైగర్ రిజర్వు పరిధిలో పకడ్బందీగా గ్రామాల తరలింపు

## అమ్రాబాద్, కవ్వాల టైగర్ రిజర్వులపై మంత్రి సురేఖ సుదీర్ఘ సమీక్ష

హైదరాబాద్, నవంబర్ 22ప్రజావినికిడి:
అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వుల పరిధిలోని గ్రామాల తరలింపు ప్రక్రియను పకడ్బంధీగా చేపట్టాలని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. తరలింపు ప్రక్రియ ప్రజల భావోద్వాగాలతో ముడిపడి ఉన్నందున, ప్రజలకు ప్రభుత్వం పట్ల విశ్వాసాన్ని కల్పిస్తూ పునరావాస ప్రక్రియను సమర్ధవంతంగా చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉత్తర, దక్షిణ సరిహద్దులుగా విస్తరించిన టైగర్ రిజర్వులు తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకతను చేకూర్చాయని, వాటిని ప్రత్యేకతను కాపాడేందుకు అటవీశాఖ నిరంతర చర్యలు చేపట్టాలని సూచించారు. డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ మంత్రిత్వ శాఖ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో మంత్రి, టైగర్ రిజర్వ్స్ గవర్నింగ్ బాడీస్ చైర్ పర్సన్ కొండా సురేఖ ఆధ్వర్యంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ల గవర్నింగ్ బాడీ సమావేశం శుక్రవారం జరిగింది.
ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకుపల్లి భూపతి రెడ్డి, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ (హెచ్ఓఎఫ్ఎఫ్) ఆర్.ఎం.డోబ్రియాల్, పిసిసిఎఫ్ (వైల్ లైఫ్) ఏలూసింగ్, డిసిసిఎఫ్ ఆంజనేయులు(హెడ్ ఆఫీస్) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అటవీ శాఖ ఉన్నతాధికారులు టైగర్ రిజర్వ్ ల గవర్నింగ్ బాడీస్,



టైగర్ కన్సర్వేషన్ ఫౌండేషన్, గవర్నింగ్ బోర్డుల ఏర్పాటు, విధివిధానాలను మంత్రి సురేఖకు సమగ్రంగా వివరించారు. ప్రాజెక్ట్ టైగర్‌లో భాగంగా 2015 ఏప్రిల్ 29న కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వులను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పులుల సంరక్షణే లక్ష్యంగా టైగర్ రిజర్వులను అభివృద్ధి చేస్తున్నట్లు వారు స్పష్టం చేశారు. ఈ దిశగా నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ చేపడుతున్న చర్యలను వివరించారు.అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ %-% ఫీల్ డైరక్టర్ ప్రాజెక్ట్ డైరక్టర్, సిఎఫ్ రాంబాబు, డిఎఫ్ఓ రోహిత్ అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌కు సంబంధించిన వివరాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంత్రి సురేఖకి సోదాహరణంగా వివరించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధిలో 26 కోర్ (కేంద్రీకృత) గ్రామాలుండగా, ప్రస్తుతం వాటిలో 4 గ్రామాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నట్లు అధికారులకు మంత్రి సురేఖకు వివరించారు. అతిపెద్ద కోర్ ఏరియా కలిగిన రెండవ టైగర్ రిజర్వుగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ నిలవడం పట్ల మంత్రి సురేఖ హర్షం వ్యక్తం చేశారు. పెరుగుతున్న పులుల ఆహారలభ్యతకు అనుగుణంగా జింకల సంఖ్యను పెంచే దిశగా చేపడుతున్న చర్యలను మంత్రి సురేఖ ప్రశంసించారు. సోమశిల, అమరగిరి ఎకో టూరిజం సర్క్యూట్, దోమలపెంట- శ్రీశైలం ఎకో టూరిజం సర్క్యూట్‌లను రాబోయే రోజుల్లో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు మంత్రి సురేఖకు అధికారులు తెలిపారు. దోమలపెంట-శ్రీశైలం ఎకో టూరిజం సర్క్యూట్‌లో భాగంగా ఎంతో ప్రాశస్త్యమైన అక్కమహాదేవి గుహలకు తెలంగాణ ప్రభుత్వపరంగా భూ, జలమార్గాల్లో భక్తులకు యాత్రా సౌకర్యం కల్పించేందుకు గాను అవకాశాలను పరిశీలించాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటి (ఎన్ టిసిఎ) కింద చేపడుతున్న పునరావాస వివరాలను అధికారులు మంత్రికి వివరించారు. పునరావాస ప్రక్రియలో భాగంగా కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధిలోని మైసంపేట్, రాంపూర్ గూడేలను తొలి విడతగా ఖాళీ చేయించినట్లు అధికారులు మంత్రి సురేఖ గారికి వివరించారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ కు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని కవ్వాల్ టైగర్ రిజర్వ్ %-% ఫీల్ డైరక్టర్ ప్రాజెక్ట్ డైరక్టర్, సిఎఫ్ శాంతారాం మంత్రి సురేఖకు వివరించారు. వన్యప్రాణుల దాడుల ఘటనల్లో మరణించిన వారికి ఇచ్చే నష్టపరిహారాన్ని రూ.10 లక్షల నుండి రూ. 20 లక్షలకు పెంచే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు మంత్రి సురేఖ ఈ సందర్భంగా తెలిపారు.

# అక్కడా ఇక్కడా కాదు.... అమెరికాలో భారీగా 'గేమ్ చేంజర్' ప్రీ రిలీజ్ ఈవెంట్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'. ఓ వైపు అభిమానులు, మరోవైపు సినీ ప్రేక్షకులు ఈ సినిమా కోసం ఎంతో ఆతృతగా ఎదురు చూస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను శ్రీమతి అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ అన్‌కాంప్రమైజ్డ్‌గా నిర్మిస్తున్నారు.

గేమ్ చేంజర్‌ను ఎస్‌వీసీ, ఆదిత్యరామ్ మూవీస్ సంస్థలు తమిళంలో విడుదల చేస్తుండగా హిందీలో ఏఏ ఫిలిమ్స్ అనిల్ తడాని రిలీజ్ చేస్తున్నారు. పక్కా ప్రమోషనల్ స్ట్రాటజీతో సినిమాపై అంచనాలు రోజు రోజుకీ పెరుగుతున్నాయి. ఈ ఎక్స్‌పెక్టేషన్స్‌కు నెక్ట్స్ రేంజ్‌లో సినిమా ఉండేలా డైరెక్టర్ శంకర్ సినిమాను రూపొందిస్తున్నారు.

తాజాగా 'గేమ్ చేంజర్' మరో సెన్సేషన్ క్రియేట్ చేయటానికి సిద్ధమైంది. ఇండియన్ సినీ హిస్టరీలో ఇప్పటి వరకు మరే సినిమా చేయని అద్భుతాన్ని ఆవిష్కరించనుంది. డిసెంబర్ 21న అమెరికాలో 'గేమ్ చేంజర్' ప్రీ రిలీజ్ ఈవెంట్ అత్యంత భారీగా జరగనుంది. కర్టిస్ కల్‌వెల్ సెంటర్, 4999 నామన్ ఫారెస్ట్, గార్‌లాండ్ టి.ఎక్స్ 75040 ఈ ముందస్తువేడుకి వేదిక కానుండటం విశేషం. చిత్ర యూనిట్‌తో పాటు ప్రముఖులందరూ ఈ వేడుకకి హాజరుకాబోతున్నారు.

సినిమాపై అంచనాలు నెక్ట్స్ లెవల్‌కు చేరుకున్న క్రమంలో 'ఛరిష్మా డ్రీమ్స్' రాజేష్ కల్లెపల్లి ఆధ్వర్యంలో ఇంత భారీగా జరగనున్న వేడుక అందరిలోనూ ఎగ్జయిట్‌మెంట్‌ను ఎంతగానో పెంచుతోంది. 'ఛరిష్మా డ్రీమ్స్'తో ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్‌గా ఇండస్ట్రీ, యు.ఎస్ డిస్ట్రిబ్యూషన్, ఎగ్జిబిటర్ సర్కిల్‌లో, ఎంట్రప్రెన్యూరర్‌గా బిజినెస్ సర్కిల్‌లో గుర్తింపు సంపాదించుకున్న రాజేష్... అమెరికా గడ్డపై ఓ తెలుగు సినిమాకు ఇప్పటి వరకు జరగలేదు... జరగబోదు అనేంత భారీ స్థాయిలో గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించబోతున్నారు. రామ్ చరణ్‌పై అభిమానంతో రాజేష్ కల్లెపల్లి ఇంత పెద్ద ఈవెంట్‌ను చేయనుండటం అనేది ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సందర్భంగా 'ఛరిష్మా డ్రీమ్స్' ప్రొడ్యూసర్, యు.ఎస్ ఎగ్జిబిటర్ రాజేష్ కల్లెపల్లి మాట్లాడుతూ "తెలుగు సినిమాల్లోనే కాదు, ఇండియన్ సినీ ఇండస్ట్రీలోనే ఇప్పటి వరకు యు.ఎస్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించలేదు. తొలిసారి గేమ్ చేంజర్ సినిమా కోసం భారీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను అమెరికాలో చేయబోతున్నందుకు ఆనందంగా ఉంది. ఈవెంట్‌ను సక్సెస్‌ఫుల్‌గా చేయటానికి ఇప్పటి నుంచే ప్లానింగ్ చేస్తున్నాం. ఈ అవకాశాన్ని ఇచ్చిన హీరో రామ్ చరణ్‌గారు, నిర్మాతలు దిల్‌రాజు, శిరీష్, శంకర్‌గారు అండ్ టీమ్‌కు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను" అన్నారు.

ఇప్పటి వరకు సినిమా నుంచి విడుదలైన పోస్టర్స్, 'జరగండి జరగండి.. ', 'రా మచ్చా రా..' సాంగ్స్‌కు, టీజర్‌కు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చింది. లార్జర్ దేన్ లైఫ్ సినిమాలను తెరకెక్కించే డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'గేమ్ చేంజర్' మూవీని ఎప్పుడెప్పుడు చూద్దామా అని అభిమానులు, సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రామ్ చరణ్ ఈ చిత్రంలో రెండు పవర్‌ఫుల్ పాత్రల్లో మెప్పించనున్నారు. కార్తీక్ సుబ్బరాజ్ కథను అందించారు. ఎస్.యు.వెంకటేశన్, వివేక్ రైటర్స్‌గా వర్క్ చేశారు. హర్షిత్ సహ నిర్మాత. ఎస్.తిరుణ్ణావుక్కరసు సినిమాటోగ్రఫీ, ఎస్.ఎస్.తమన్ సంగీతం అందిస్తుండగా సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాశారు. నరసింహా రావు.ఎన్, ఎస్.కె.జబీర్ లైన్ ప్రొడ్యూసర్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఆర్ట్ డైరెక్టర్‌గా అవినాష్ కొల్ల, యాక్షన్ కొరియోగ్రాఫర్స్‌గా అన్బరివు, డాన్స్ డైరెక్టర్‌గా ప్రభుదేవా, గణేష్ ఆచార్య, ప్రేమ్ రక్షిత్, బాస్కో మార్టిన్, జానీ, శాండీ వర్క్ చేస్తున్నారు. రామ్ జోగయ్య శాస్త్రి, అనంత్ శ్రీరామ్, కాసర్ల శ్యామ్ పాటలను రాశారు.




# పక్కకు తప్పుకుంటే ఇండస్ట్రీలో పనైపోయినట్లే!



సత్యదేవ్ టాలీవుడ్ ట్యాలెంటెడ్ నటుల్లో ఒకరు. క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా పరిచయమై ఇప్పుడిప్పుడే ప్రధాన పాత్రల వైపు సాగుతున్నాడు. 'గాడ్ ఫాదర్'..'ఆచార్య' లాంటి ప్రతిష్టాత్మక చిత్రాల్లో అవకాశాలు కేవలం తన ప్రతిభతోనే అందు కుంటున్నాడు. అతని నటన మెచ్చి చిరంజీవి కల్పించిన ఛాన్సులవి. 'బ్లఫ్ మాస్టర్' లాంటి సినిమా అతనికి ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చింది. బాలీవుడ్ లో సైతం అవకాశాలు అందుకునే స్థాయికి ఎదిగాడు. ఇప్పటికే హిందీ సినిమా 'రామసేతు'లో నటించిన సంగతి తెలిసిందే. అప్పుడప్పుడు తెరపై హీరోగానూ మెప్పిస్తున్నాడు. 'స్కైలాబ్'..'గాడ్సే'..'గుర్తుంతా శీతాకాలం'..అంతకు ముందు పూరి తెరకెక్కించిన 'జ్యోతిలక్ష్మి' లాంటి సినిమాల్లో మెయిన్ లీడ్స్ లో నటించాడు. ' కృష్ణమ్మ..'ఫుల్ బాటిల్' లాంటి చిత్రాల్లో నటించాడు. ప్రస్తుతం సత్యదేవ్, డాలీ ధనుంజయ్ ప్రధాన పాత్రల్లో ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో 'జీబ్రా' అనే సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా రిలీజ్ సందర్భంగా ఇండస్ట్రీలో తన అనుభవాన్ని పంచుకున్నాడు. పరిశ్ర మలో నిలదొక్కుకోవాలంటే ప్రత్యేకంగా ఏదో ఒకటి చేయాలి. ఏపాత్ర అయినా చేస్తామని నిరూపించు కోగలగాలి. హీరోగానే కాక ఎలాంటి పాత్ర అయిన పోషిస్తాడు? అనే భరోసా అవతలి వారికి కల్పించాలి. ఏ నటుడికైనా అంతిమంగా కావాల్సింది ఒక బ్రేక్. అలాంటి బ్రేక్ ఒకటి వస్తే చాలు. తర్వాత దానందటదే అవకాశాలు వస్తాయి. అలాంటి నాదైన ఒక రోజు వచ్చే వరకూ ట్రాక్ మీద ఎదురు చూస్తూనే ఉండాలి. అలా కాదని వెళలిపోతే మన పని అయిపోయినట్లే. నేనైతే ఎప్పుడూ ట్రాక్ మీద ఉండేలా చూసుకుంటా. ఇప్పుడు అలాగే నిలబడ్డాను.' నాకంటూ ఓ మంచి శుక్రవారం తగిలినప్పుడు పూర్తిగా హీరో పాత్రలే చేస్తా' అన్నాడు. మొత్తానికి సత్యదేవ్ పూరి జగన్నాథ్ కొటేషన్లు బాగా ఫాలో అవుతున్నట్లు కనిపిస్తుంది. మనం ఎక్కాల్సిన రైలు బండి వచ్చే వరకూ ప్లాట్ ఫాం మీద ఎదురు చూడాల్సిందే. ఆ ట్రైన్ ఇప్పుడు రావొచ్చు...తర్వాత రావొచ్చు...కానీ ఏదో సమయంలో వస్తుంది. అప్పటి వరకూ ఎదురు చూడాలి. రైలు రాలేదని వెళ్లిపోతే గమ్యం చేరడం సాధ్యపడదని పూరి ఓ సందర్భంలో అన్నారు.

# మోహన్ బాబు ది గ్రేట్..

## నటుడిగా 50 ఏళ్ల ప్రయాణం!

**నటుడిగా 50వ ఏడాదిలోకి అడుగుపెట్టిన మోహన్ బాబు**
**నిర్మాతగా 75 చిత్రాలను నిర్మించిన ఘనత**
**'స్వర్గం నరకం' చిత్రంతో పరిశ్రమకు హీరోగా పరిచయం**




విలక్షణ నటుడిగా, డైలాగ్ కింగ్ గా తెలుగు సినీ ప్రేక్షకులను అలరించిన మోహన్ బాబు... నటుడిగా 50వ ఏడాదిలోకి అడుగుపెట్టారు. అంకితభావం, పట్టుదల, క్రమశిక్షణతో ఐదు దశాబ్దాలుగా నటుడిగా సుదీర్ఘ ప్రయాణాన్ని ఆయన కొనసాగిస్తున్నారు. నటుడిగా కొనసాగుతూనే... నిర్మాతగా 75 చిత్రాలను ఆయన నిర్మించారు. మోహన్ బాబు తొలినాళ్లలో విలన్ గా నటించారు. 1975 నుంచి 1990 వరకు ఆయన విలన్ పాత్రలకు కొత్త నిర్వచనాన్ని తీసుకొచ్చారు. ఆ రోజుల్లో దేశంలో అత్యధిక డిమాండ్ ఉన్న విలన్ లలో ఆయన ఒకరిగా నిలిచారు. 'స్వర్గం నరకం' చిత్రంతో పరిశ్రమకు హీరోగా పరిచయం అయినా.. విలన్ పాత్రలతో టాప్ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. 1990వ దశాబ్దంలో, మోహన్ బాబు హీరోగా మారి ప్రేక్షకులను తనదైన శైలితో అలరించారు. అల్లుడు గారు, అసెంబ్లీ రౌడీ, పెదరాయుడు వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలు ఆయన స్థాయిని పెంచాయి. 1993లో ఆయన నిర్మించిన 'మేజర్ చంద్రకాంత్' చిత్రం... ఎన్టీఆర్ తిరిగి ముఖ్యమంత్రి పదవి చేపట్టడంలో కీలక పాత్ర పోషించింది.మోహన్ బాబు తన సుదీర్ఘమైన కెరీర్‌లో ఎన్నో గౌరవపురస్కారాలను అందుకున్నారు. 2007లో భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో ఆయనను గౌరవించింది. 2016లో ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఆయనను వరించింది.నటుడిగా మోహన్ బాబు 50 ఏళ్లను పూర్తి చేసుకున్న సందర్భాన్ని ఆయన కుమారుడు, నటుడు మంచు విష్ణు ఘనంగా సెలెబ్రేట్ చేయబోతున్నారు. 2024 డిసెంబర్ నుండి ప్రతి నెల ప్రత్యేక ఈవెంట్లను నిర్వహిస్తారు. 2025 నవంబర్ వరకు ప్రతి నెల ఒకటో తేదీన ఈ ఈవెంట్‌లకు సంబంధించిన ప్రకటన వస్తుందని విష్ణు తెలిపారు.

# మీరు క్షమార్హులు కారు

## : పోసానిపై టాలీవుడ్ నిర్మాత సంచలన వ్యాఖ్యలు



ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటానని సినీ నటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇకపై ఏ పార్టీని తిట్టనని, ఏ పార్టీని పొగడనని ఆయన అన్నారు. తన కుటుంబానికి తగిన సమయం ఇవ్వలేకపోతున్నానని... అందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. మరోవైపు చంద్రబాబు, పవన్ కల్యాణ్, వారి కుటుంబ సభ్యులపై గతంలో పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ కారణంగా ఆయనపై పలు చోట్ల పోలీస్ కేసులు నమోదయ్యాయి. ఆయనను అరెస్ట్ చేసే అవకాశాలు కూడా ఉన్నాయనే ప్రచారం జరిగింది. ఇంతలోనే పోసాని నుంచి కీలక ప్రకటన వెలువడటం గమనార్హం. మరోవైపు పోసాని నిర్ణయంపై టాలీవుడ్ నిర్మాత ఎస్కేఎన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల నుంచి తప్పుకుంటున్నా అంటూ మీరు నటించే ముందు... తమ అభిమాన నాయకుడి గురించి, వారి ఇంట్లోని పసి పిల్లల గురించి మాట్లాడిన సంస్కార హీనమైన, నీచమైన మాటలకు చింతిస్తున్నానని లేదా క్షమించండని అడిగి ఉంటే... మీ మాటలను నమ్మాలనిపించేదని అన్నారు. మీరేదో పొరపాటున ఒకసారి మాట్లాడిన వ్యక్తి కాదని మండిపడ్డారు. ఎన్నోసార్లు చాలా నీచంగా మాట్లాడారని దుయ్యబట్టారు. అభిమానుల మనసును మీరు ఎంతో బాధ పెట్టారని ఎస్కేఎన్ అన్నారు. ఛీ ఇవేం మాటలు అంటూ అందరూ చెవులు మూసుకునేలా చేశారని మండిపడ్డారు. ఎవరి కుటుంబాలైనా, ఎవరి పిల్లలైనా ఒక్కటేనని చెప్పారు. రాజకీయాల్లో విమర్శలు సహజమేనని... కానీ వ్యక్తిగతంగా దిగజారిపోయి కుటుంబాల మీద కామెంట్స్ చేసిన మీలాంటి వాళ్లు ఏ మాత్రం క్షమార్హులు కారని అన్నారు.

# మిల్కీ కాదు గోల్డెన్ బ్యూటీ



మిల్కీ బ్యూటీ తమన్నా సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి సుదీర్ఘ కాలం అవుతున్నా ఇప్పటికీ వరుస సినిమాలతో, సిరీస్‌లతో బిజీ బిజీగానే ఉంటుంది. తాజాగా ఈమె బాలీవుడ్‌లో చేసిన సినిమా ప్రమోషన్‌లో భాగంగా పలు ఆసక్తికర పోస్టలను, ఫోటోలను షేర్ చేస్తూ వస్తోంది. ఈ మధ్య కాలంలో టాలీవుడ్‌లో ఈ అమ్మడు సినిమాలు చేయక పోయినా అభిమానులు సోషల్ మీడియా ద్వారా ఆమె షేర్ చేస్తున్న ఫోటోలు, వీడియోలతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నెట్టింట తమన్నాను ఎప్పుడూ అభిమానిస్తూ, ఫాలో అవుతున్న వారు చాలా మంది ఉన్నారు. తాజాగా వారి కోసం మరో అందాల ఆరబోత ఫోటో షూట్‌ను ముద్దుగుమ్మ తమన్నా షేర్ చేసింది. ఈసారి మిల్కీ బ్యూటీ తమన్నా క్లీ వేజ్ షో చేస్తూ బంగారు వర్ణపు డ్రెస్‌లో మెరిసింది. నేను గోల్డెన్ గర్ల్ అంటూ తనకు తాను ట్యాగ్ ఇచ్చుకుని అందమైన ఫోటోలను షేర్ చేసిన ముద్దుగుమ్మ తమన్నా పోటోలు ఎప్పటిలాగే వైరల్ అవుతున్నాయి. ఇండస్ట్రీలో వచ్చి ఇన్నాళ్లు అయినా, మూడు పదుల వయసులోనూ మిల్కీ బ్యూటీ ఈ స్థాయి అందం ఎలా సాధ్యం అర్థం కాదు అంటూ నెట్టింట కొందరు కామెంట్ చేస్తూ ఉంటారు. తాజాగా మరోసారి ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు వైరల్ అవుతున్న నేపథ్యంలో పాపం టాలీవుడ్ లో ఆఫర్లు దక్కక పోవడం విచారకరం అంటూ ఆవేదన చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. %శూశ్రీంశీ =ఝుం% - నాగచైతన్య నెక్ట్స్.. 100 కోట్లు కాదు, అంతకుమించి! మిల్కీ బ్యూటీ తమన్నా సీనియర్ హీరోలకు జోడీగా అయినా వరుసగా సినిమాలు చేస్తే బాగుంటుంది అనే అభిప్రాయంను వ్యక్తం చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. వెబ్ సిరీస్‌లతో పాటు ప్రత్యేక పాటల్లోనూ కనిపించేందుకు ఎలాంటి మొహమాటం లేదని చెబుతూ ఉన్న ఈ అమ్మడు మరోసారి ఒక స్టార్ హీరో సినిమాలో ఐటెం సాంగ్ ను చేసేందుకు రెడీ అయ్యిందని తెలుస్తోంది. హిందీలో ఈమె వరుసగా సినిమాలు చేస్తోంది. కానీ ఇప్పటి వరకు ఈమెకు సాలిడ్ సక్సెస్, మంచి గుర్తింపు దక్కించుకోలేక పోయింది. హిందీతో పాటు ఇతర భాషల్లో ఆఫర్లు సొంతం చేసుకుంటూనే మరో వైపు సోషల్ మీడియాలో ఇలాంటి అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా తమన్నా తన ఉనికిని కాపాడుకుంటూ వస్తుంది. మరో అయిదు పదేళ్ల పాటు తమన్నా ఇదే అందంతో, ఇంతే బిజీగా ఉండాలని, మరిన్ని సినిమా ఆఫర్లు తమన్నాకు రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. ప్రస్తుతం మిస్ అయిన స్టార్ హీరోల సినిమాలు ఈమెకు మళ్లీ దక్కాలని కొందరు కోరుకుంటున్నారు. టాలీవుడ్‌లో మిల్కీ బ్యూటీ ఇదే అందంను కంటిన్యూ చేస్తే బిజీ అయ్యేనా చూడాలి.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701123